THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

## మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ముద్రించబోవు నట్టి పుస్తకములను, సత్యవాక్య మాస పత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.,
KAKINADA - 533 004

గమనిక :— మీరు M. O. పంపునప్పుడుగాని, మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడుగాని మీ సత్య వాక్య నంబరును దయచేసి తెలియ జేయండి.

Razan Electric Press, Kakinada

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **10** మే–**1982** సంపుటి **2**


# సంపాదకీయము

## సత్యమును అసత్యమునకు మార్చుట

*(Exchanging the Truth for Error)*

క్రీస్తు ఈ లోకమునకు వచ్చినప్పుడు ఆయన దేవుని ప్రవక్త ఆయెను. అంటే తన చిత్తమును మానవునికి తెలియ జేయుటకు దేవుడాయనద్వారా మాటలాడెను. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను" అని యోహాను 1:1 లో వ్రాయబడి యున్నది. "పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" అని హెబ్రీ పత్రిక లేఖకుడు తెలియ జేయుచున్నాడు (హెబ్రీ 1:1, 2). యేసు రూపాంతరము పొందినప్పుడు "ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయనయందు

నే నానందించుచున్నాను, ఈయనమాట వినుడని యొక శబ్దము ఆ మేఘములో నుండి పుట్టెను" (మత్తయి 17:5).

దేవుని వాక్యము లిఖించుటకుగాను కొందరు పరిశుద్ధాత్మ ప్రేరణ కలిగి యుండిరి. గనుక పౌలు ఇట్లు ప్రకటింప గలిగెను: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుట కును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుట కును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16, 17). ఈ లేఖ నములను గూర్చి క్రీస్తు, "ఆకాశమును భూమియు గతించునుగాని నా మాటలు ఏమాత్రమును గతింపవు" అని చెప్పెను (మత్తయి 24:35). మరల "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు, నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" అని ఆయన చెప్పెను (యోహాను 12:48).

దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). సత్యమువలన మాత్రమే ఒకడు రక్షింపబడును (యోహాను 8:32). నీవు, నేను, అందరుకూడ సత్యమును తెలిసికొనునట్లు దేవుడు తన చిత్తమును క్రీస్తు ద్వారా బయలు పరచెను. అందువలన మనము ఆయన వాక్యమును చదువవలెను, పఠించవలెను (యోహాను 5:39; 2 తిమో 2 : 15), దానిని నమ్మి లోబడవలెను (యోహాను 20:31; యాకోబు 1:22). అట్లు చేసిన యెడల మనము రక్షింపబడి నిత్యజీవ నిరీక్షణ కలిగి యుండగలము (ప్రకటన 22:14).

మనము దేవుని వాక్యమును గౌరవించి, దానిని ఉన్నరీతిగానే ఉంచవలెనని బోధింపబడితిమి. మనము దానికి కలుపరాదు, తీసివేయ రాదని హెచ్చరింప బడితిమి (ప్రకటన 22:18, 19). దానికి మన సొంత ఊహను బట్టి భావార్థము చెప్పరాదు (2 పేతురు 1:20). గాని మనము దైవోక్తులను బోధించినట్లు బోధింపవలెను (1 పేతురు 4:11).

బోధించునప్పుడు మనము దేవుని వాక్యమును బోధింపవలెనని పౌలు ఇట్లు చెప్పెను: "వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణ దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము" (2 తిమో 4:2).

క్రైస్తవులలోని విశ్వాసులలో ఎక్కువమంది దీనియంతటికీ విరుద్ధముగా చేసియుండుట ఆశ్చర్యకరముగా యున్నది. వారు దేవుని వాక్యమునకు కలిపారు, దానినుండి తీసివేసారు. వారు బోధించే దానిలో ఎక్కువ వారిస్వంత అభిప్రాయములే యుండునని వారంగీకరింతురు. ఇంకోమాటలో సత్యము అసత్యమువలెను, అసత్యము సత్యమువలెను అగుపడునట్లుచేసి వారు దీనినంతటిని తలక్రిందులు చేసేసారు. ఉదాహరణకు విశ్వాసమువలన మాత్రమే ఒకడు రక్షింపబడునని బైబిలు బోధించుటలేదు (యాకోబు 2:17-26); గాని అదొక్కటి మాత్రమే చాలునని వారు బోధింతురు. విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలుల తదనంతరము బాప్తిస్మము రక్షించునని బైబిలు బోధించుచున్నది (1 పేతురు 3:21). గాని బాప్తిస్మము రక్షించదని వారందురు. ఒకే ఒక్క విశ్వాసమున్నదని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 4:5), గాని అనేక విశ్వాసములున్నవని వారు బోధింతురు. ఒకే ఒక్క సంఘమున్నదని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 4:4; కొలస్స 1:18), గాని అనేక రకములైన డినామినేషన్లన్నియు ఒకే సంఘమై యున్నవని వారు మనకు వివరింతురు. సంఘమను శరీరమునకు క్రీస్తే రక్షకుడని బైబిలు చెప్పుచున్నది (ఎఫెసీ 5:23). గనుక రక్షింపబడుటకు ఒకడు దాని సభ్యుడై యుండవలెను (అపో.కా. 2:47), గాని దానిలో సభ్యుడు కాకుండగనే రక్షింపబడవచ్చునని వారు లోకానికి చాటింతురు. పరలోకమునకు వెళ్లుటకు ఒకే ఒక్క మార్గమున్నదని బైబిలు బోధించుచున్నది (యోహాను 14:6), గాని అనేక మార్గము లున్నవని వారు వివరింతురు. బైబిలు బోధించు అంశములకు భిన్నముగా మన

భక్తిగల మిత్రులు బోధించు అనేక అంశములను గూర్చి మనము చెప్పుకొన వచ్చును.

ఇట్టిది జరుగునని మొదటి శతాబ్దములోనే చెప్పబడెను. అపొ. పౌలు ఇట్లనెను: "జనులు హితబోధను సహింపక దురద చెవులు గల వారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపుకు తిరుగు కాలము వచ్చును" (2 తిమో 4:3, 4). దేవుని సత్యమును అసత్యమునకు మార్చిన ప్రజలను గూర్చి కూడ అతడు చెప్పెను (రోమా 1:25). దేవుని వాక్యమైన సత్యమును ప్రజలు పరిగణించు విధానమును అతడు తన వ్రాతలలో వివరించెను:

1. "అయితే భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును" (రోమా 2:8).

2. "ఓ అవివేకులైన గలతీయులారా, మిమ్మును ఎవడు భ్రమపెట్టెను? సిలువ వేయబడినవాడైనట్టుగా యేసుక్రీస్తు మీ కన్నుల యెదుట ప్రదర్శింప బడెనుగదా?" (గలతీ 3:1).

3. "మీరు బాగుగా పరుగెత్తుచుంటిరి; సత్యమునకు విధేయులు కాకుండ మిమ్మును ఎవడు అడ్డగించెను?" (గలతీ 5:7).

4. "సహోదరులారా ప్రభువు దిన మిప్పుడే వచ్చి యున్నట్టుగా ఆత్మ వలననైనను, మాటవలననైనను మా యొద్దనుండి వచ్చినదని చెప్పిన పత్రికవలననైనను ఎవడైనను చెప్పిన యెడల మీరు త్వరపడి చంచల మనస్కులు కాకుండవలెననియు, బెదరకుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడను బట్టియు మనము ఆయన యొద్ద కూడుకొనుటను బట్టియు మిమ్మును వేడుకొనుచున్నాము. మొదట భ్రష్టత్వము సంభవించి నాశనపాత్రుడగు పాప పురుషుడు బయలు పడితేనే గాని ఆ దినము రాదు. ఏది దేవు డనబడునో, ఏది పూజింపబడునో

దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్ను తానే హెచ్చించు కొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచు కొనుచు దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి. నేనింకను మీయొద్ద ఉన్నప్పుడు ఈ సంగతులను మీతో చెప్పినది మీకు జ్ఞాపకము లేదా? కాగా వాడు తన సొంతకాలమందు బయలుపరచబడ వలెనని వానిని అడ్డగించునది ఏదో అది మీరెరుగుదురు. ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియ చేయుచున్నది గాని యిదివరకు అడ్డగించుచున్నవాడు మధ్యనుండి తీసివేయ బడువరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలుపరచబడును. ప్రభువైన యేసు తన నోటి యూపిరి చేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశముచేత నాశనము చేయును. నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్య విషయమైన ప్రేమను అవలంబింపకపోయిరి గనుక వాని రాక అబద్ధవిషయమైన సమస్త బలముతోను, నానావిధములైన సూచక క్రియలతోను మహత్కార్యములతోను దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను నశించుచున్న వారిలో సాతాను కనుపరచు బలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష గలవారందరును శిక్షావిధి పొందుటకై అబద్ధమును పొందునట్లు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స 2 : 1–12).

5. "ఎవడైనను మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క హిత వాక్యములను దైవభక్తికి అనుగుణ్యమైన బోధను అంగీకరింపక భిన్నమైన బోధ ఉపదేశించిన యెడల వాడేమియు ఎరుగక తర్కములను గూర్చియు వాగ్వాదములను గూర్చియు వ్యర్థముగా ప్రయాసపడుచు గర్వాంధుడగును. వీటిమూలముగా అసూయ, కలహము, దూషణలు దురభిమానములును, చెడిపోయిన మనస్సు కలిగి సత్యహీనులై

దై వభక్తి లాభసాధన మనుకొను మనుష్యుల వ్యర్థ వివాదములును కలుగుచున్నవి" (1 తిమో. 6:3-5).

6. "వారు పునరుత్థానము గతించెనని చెప్పుచు సత్యము విషయము తప్పిపోయి కొందరి విశ్వాసమును చెరుపు చున్నారు" (2 తిమో 2:18).

7. "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టు లగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు వాతవేయబడిన మనస్సాక్షి గలవారై వివాహము నిషేధించుచు సత్యవిషయమై అనుభవ జ్ఞానముగల విశ్వాసులు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహార వస్తువులను కొన్నిటిని తినుట మానవలెనని చెప్పుచుందురు. దేవుడు సృజించిన ప్రతి వస్తువును మంచిది. కృతజ్ఞతా స్తుతులు చెల్లించి పుచ్చుకొనిన యెడల ఏదియు నిషేధింపతగినది కాదు. ఏలయనగా అది దేవుని వాక్యమువలనను, ప్రార్థనవలనను పవిత్రపరచ బడుచున్నది" (1 తిమోతి 4:1-5).

ఈ వచనము లన్నిటిని చదువుచున్నప్పుడు కొన్ని వాస్తవములు మన కండ్ల కెదురుగా కనబడుట నీవు గమనించితివా? అవన్నియు సత్యమును గూర్చి యున్నవే గాని ప్రతి సందర్భములోను సత్యము నిరాకరించబడెను, లేక మార్చబడెను లేదా అసత్యమునకు మార్చబడెను. నీ చుట్టుయున్న ప్రజలమధ్య ఈ సంగతులేమైనా జరుగుట నీవు చూచుచున్నావా? పౌలు ఇట్లు లిఖించెను: "ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూల మైనదియునై యున్నది. ఆయన, మనుష్యులందరు రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1 తిమో. 2:3, 4). అందరు రక్షింపబడవలెనని ప్రభువు కోరుచున్నాడని నీవు

గమనించగలవు. అయినను ఏ ఒక్కడయిన రక్షింప బడవలెనంటే అతడు సత్యమును గౌరవించి దానిని పఠించి ప్రభువు చిత్తము తెలిసికొనవలెను. అతడు దానిని విశ్వసించి దానికి లోబడవలెను. ఏవిధముగనైనను సత్యము నిరాకరించబడిన యెడల ఒకడు రక్షించబడుట అసాధ్యము.

ఆదాము హవ్వలు నిషేధింపబడిన ఫలమును తిను దినమున వారు నిశ్చయముగా చచ్చెదరని అలనాడెప్పుడో దేవుడు వారికి చెప్పెను (ఆది 2:17; 3:1-3). గాని "మీరు చావనే చావరు" అని సర్పము హవ్వతో అనెను (ఆది 3:4). దేవుని మాటలను సర్పము సునాయాసముగా మార్చివేసెను. మీరు చచ్చెదరని ప్రభువు చెబితే, మీరు చావరని అపవాది చెప్పెను. వీరిద్దరిలో ఎవరు రైటు? దేవుడే రైటని మన మెరుగుదుము. అసత్యమును నమ్మి దానికి లోబడుట వలన ఆదాము హవ్వలకు, మానవజాతి యంతటికి సంభవించిన దుస్థితి మన మెరుగుదుము. యిది 1 పేతురు 3:21 లో పేతురు చెప్పిన సంగతిని మనకు గుర్తు తెచ్చుచున్నది. "బాప్తిస్మము ఇప్పుడు మనలను రక్షించుచున్నదని" పేతురు చెబుతున్నాడు గాని మానవుడయితే "బాప్తిస్మము యిప్పుడు మనలను రక్షించదు" అంటున్నాడు. వీరిద్దరిలో యెవరు రైటని నీవనుకొనుచున్నావు? నీసంగతి నాకు తెలీదు గాని నేనయితే దేవుని వాక్యమే రైటని నమ్ముచున్నాను.

దేవుని వాక్యమును మార్చివేసి దానికి భిన్నమైన సంగతులను అది బోధించుచున్నదని నిరూపించుటకు ప్రయత్నించుట ఎంత విచారకరమో! నామిత్రుడా, నీవు సత్యమును మార్చివేసినప్పుడు దానికి కలిపినప్పుడు, దాని నుండి తీసివేసినప్పుడు, దానికి బదులుగా వేరొక దానిని ఉంచినప్పుడు, ఏమి ఫరవాలేదులేయని అనుకొనుచు దానిని నిరాకరించునప్పుడు నీవు ప్రమాదములో యున్నావు. అట్లు చేయుటకు మనకు హక్కేమీ లేదు. దానిని ఆయన సహించడు. చివరికి ప్రతి

మనుష్యుడు అబద్ధికుడగును గాని దేవుడు సత్యవంతుడు కాక తీరడు. (రోమా 3:4). దేవుని వాక్యము ఉన్న రీతిగానే దానిని ఉంచితే మనము జ్ఞానులమే. ఆయన తన చిత్తమును మనకు సంపూర్తిగ బయలు పరచెను. అది ఉన్నలాగుననే దానిని నమ్మి దానికి లోబడ వలెనని ఆయన కోరుచున్నాడు. మనమట్లు చేసినప్పుడే ఆయన రక్షించునుగాని అంతకు ముందు కాదు. దేవుని వాక్యమును కించ పరచి సరిగ నుపదేశించని వారికి తగిన సమయమందు ప్రభువే ప్రతిదండన చేయును.

---

# ఈ వర్తమానము నీకా?

## (Is this message for You?)

ఈ వర్తమానము అవిశ్వాసికి కాదు. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నిరూపించుటకున్న రుజువు లనేకము లున్నవి. ఆ రుజువులను పరిశీలించువా డెవడయినను యేసు దేవుని కుమారుడని తప్పక నమ్మునని నా దృఢ విశ్వాసము. గాని ఆ రుజువులను ఇక్కడ చూపించుటకు నేను ప్రయత్నించుట లేదు.

ఈ వర్తమానము బైబిలు వాక్యూర్వక దివ్య ప్రేరణ వలన కలిగిన గ్రంధమని నమ్మనివానికి కాదు. దానిని గూర్చిన రుజువులెట్లున్నవంటే సహృదయు లందరు వాటిని జాగ్రత్తగా పరిశోధించిన యెడల వారందరు తప్పక విశ్వాసు లగుదురని నా నమ్మకము. గాని ఆ రుజువు లిచ్చుట చూపించుటకు నేను ప్రయత్నించను. బైబిలు దేవుని వాక్యమని నీవు నమ్ముచున్నావు. గనుక ముందుకు సాగుదము.

## ఐక్యత కొరకు యేసు ప్రార్థించెను

యేసు తన అనుచరులు ఏకమై యుండవలెనని ప్రార్థించెను. "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21). అసాధ్యమైన దానికొరకు యేసు ప్రార్థించెనా? యేసుక్రీస్తు పునరుత్థానుడైన దేవుని కుమారుడని ఈ లోకములో ఎక్కువమంది నమ్ముట లేదు. వారి యాత్మలు ప్రమాదములో యున్నవి. ఏలయనగా యేసు ఒక్కడే రక్షించును. "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ. కా. 4 : 12).

### ఒకే నామము

గనుక క్రీస్తు నామమున తప్ప వేరొక నామమున రక్షణలేదని దేవుని వాక్యమునుండి మనము తెలిసికొనగలము. యెషయా ప్రవక్త ద్వారా దేవుడిట్లనెను: "జనులు నీ నీతిని కనుగొనుదురు, రాజులందరు నీ మహిమను చూచెదరు. యెహోవా నియమింపబోవు క్రొత్త పేరు నీకు పెట్టబడును" (యెషయా 62:2). ఆ క్రొత్తపేరు యేమిటి? ఆ క్రొత్తపేరు యిదిగో—క్రైస్తవుడు. ఆ కాలమునకు ముందు యెవడును క్రైస్తవుడని పిలువబడలేదు. పరిశుద్ధాత్ముడు ఈ క్రొత్తపేరును ధృవపరచుచున్నాడు: "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు 4:16). ఈ నామముతో మనము ఏకము కాగలము. గాని మనము ఏకమై యుండి వేరొక నామము ధరించుకొన

లేము; అనగా మనము క్రీస్తునందు ఏకమై యుండలేము. ఏల యనగా ఆయన మన కిచ్చిన నామము అదియే.

## ఒకే సంఘము

దేవుని మందిరమే జీవముగల దేవుని సంఘమై యున్నది (1 తిమోతి 3:15). అంత్య దినములలో యెహోవా మందిరము స్థిర పరచబడునని సమస్త జనాంగములు దానిలో ప్రవేశింతురని దేవుడు యెషయాద్వారా మనకు తెలియపరచెను (యెషయా 2:2). గనుక జనాంగము లన్నిటికీ ఒకే ఒక్క సంఘ ముండునని దేవుడు ప్రవచించెను. ఈ ఒకే సంఘము సదాకాలముండునని పౌలు చెప్పుచున్నాడు: "క్రీస్తు యేసు మూలముగా, సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక" (ఎఫెసీ 3:21). దేవుడు మనకు ఒకే నామమును ఒకే సంఘమును యిచ్చెనను సంగతి అతి విపులముగా యున్నది. యేసు తన సంఘమును కట్టుదునని పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని చెప్పెను (మత్తయి 16:18). పరిశుద్ధ లేఖనముల ఉపదేశమును మరల గమనించుము: పురుషుడు భార్యకు శిరస్సైయున్నలాగున క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. అది ఒక్కటే. క్రీస్తు సంఘమును ప్రేమించి దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను. ఆయన దానిని పరిశుద్ధపరచెను. అది నిష్కళంకమైనదై పవిత్రముగా యుండవలెను (ఎఫెసీ 5:25-27).

వివాహములో భార్యా భర్తలు ఏకశరీర మగుదురు. అట్లే క్రీస్తు, ఆయన సంఘము ఏకమై యుండవలెను (ఎఫెసీ 5:31, 32). దేవునిచే నిర్ణయింపబడిన ఒకే ఒక్క సంఘ మున్నదని మనము విశ్వసించకుండుటకు దేవుడు మనకు అవకాశ మేమియు ఇయ్యలేదు. ఒకే ఒక్క శరీర మున్నది (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1:22, 23). మనకు ఒకే నామము, ఒకే సంఘము ఉన్నదని తెలిసికొంటిమి. మనకు ఒకే ఒక్క ప్రభువు (పాలకుడు) ఉన్నాడని, ఒకే విశ్వాసము,

ఒకే బాప్తిస్మము ఉన్నదని కూడ తెలిసికొందము (ఎఫెసీ 4:5). సర్వాధికారము కలిగినవాడు క్రీస్తే (మత్తయి 28:18). ఈయన ప్రభుత్వమునకు గాక వేరొకదానికి మనము లోబడలేము.

ఒకే ఒక్క విశ్వాసమున్నది. ఆ విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబడెను (యూదా :3). ఒకే ఒక్క బాప్తిస్మమున్నది. అది పాపక్షమాపణ కొరకైన బాప్తిస్మము (అపొ. కా. 2 : 38). మనము ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమి (1 కొరింథీ 12:13). ఆ ఒకే శరీరమే సంఘమని మనము ఇంతకు ముందే తెలిసికొని యున్నాము.

## విభజనలకు మూలకారణము

ఒకటికంటె (క్రైస్తవుడు అను పేరుకంటె) ఎక్కువ పేర్లను మనము కలిగియున్న యెడల విభజన యేర్పడును (1 పేతురు 4:16). ఒకటి కంటె ఎక్కువ సంఘములను మనము కలిగియున్న యెడల మనలో విభజన యేర్పడును (ఎఫెసీ 4:4; 1:22, 23). మనకు రెండు సంఘము లున్న యెడల అత్యవసరముగా మనకు ఒకటికంటె ఎక్కువ ప్రభువులున్నారు, ఒకటికంటె ఎక్కువ విశ్వాసము, ఒకటికంటె ఎక్కువ బాప్తిస్మము ఉన్నవి. వేరొక విశ్వాసము గలవారు వేరొక బాప్తిస్మము కలిగి యుందురు.

## సంఘారంభము

ఇప్పుడు సంఘారంభ దినమును పరిశీలింతము, ఆ సంఘము యేసు నిర్మింతునని వాగ్దానము చేసినది. రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). సువార్త యనగా క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థాన వాస్తవములని పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా ప్రకటించెను (1 కొరింథీ 15:1-4). ఈ వాస్తవములు ప్రపంచమునకు పెంతెకొస్తునాడు మొదటిగా ప్రకటింపబడెను. యిది

అపొ. కా. 2 లో రికార్డు చేయబడెను. పేతురు క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములను ప్రకటించిన తరువాత అతడిట్లనెను: "మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొన వలెను" (అపొ.కా. 2:36). యేసు యొక్క అధికారమును గుర్తించి, "వారు ఈ మాటవిని హృదయములో నొచ్చుకొని సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడిగిరి" (అపొ.కా. 2:37). ప్రజలు ఏకమై యుండవలెనంటే అపొస్తలులద్వారా ఈయబడిన వాక్యమును నమ్మవలెను అని ఈ వ్యాసారంభములో తెలిసికొంటిమి (యోహాను 20:30, 31). పేతురు చెప్పుదానిని యిప్పుడు వినుము: "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38). దేవుని ప్రణాళికను గమనించుము: "కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41). వారిని ఎవరు చేర్చిరి? ప్రభువే వారిని చేర్చెను (అపొ.కా. 2:47).

ప్రభువు సంఘముతో చేర్చబడిన ఈ ప్రజలు అపొస్తలుల మాటలను విని వాటికి లోబడిన తరువాత యేమిచేసిరో గమనింతము: "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ. కా. 2:42).

## మీ కొరకు ఆహ్వానము

మన పౌరసత్వము పరలోకమందున్నది. ఈ పాఠములో మనము ధ్యానించి కనుగొనిన సువిశేష మాదిరి ననుసరించి ప్రభువైన యేసుక్రీస్తును సేవించుటలో మీరు మాతో ఏకీభవించ వలెనని మిమ్మును ఆహ్వానించుచున్నాము.

"యేసు నేనేమార్గమును సత్యమును జీవమును; నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6). విభజనలు పాపకరము (రోమా 16:17). మనము బైబిలులో ఈయబడిన మార్గము ననుసరించుచు ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము (1 యోహాను 1:7).

దేవుని వాక్యములో బయలుపరచ బడిన మాదిరి చొప్పున నేనాయనను సేవించ గోరుచున్నాను. మరి నీవు? సమస్త దుర్నీతి నుండి క్రీస్తు రక్తము మనలను పవిత్రులనుగా చేయవలె నంటే మనము సహవాసము కలిగి యుండ వలెను (1 యోహాను 1:7).

యేసు దేవుని కుమారుడని లోకము నమ్మునా?

—జె. సి. బెయిలీ

---

యేసును వెంబడించిన పండ్రెండుగురు_2

## అంద్రెయ:

## క్రీస్తు పరిచయాన్ని పంచుకొన్నవాడు

### *( Andrew: Sharer of His Acquaintance With the Christ )*

అంద్రెయ ముఖ్యముగా సీమోను పేతురు యొక్క సహోదరుడని ఎరుగబడినవాడు. నాయకుని కుండవలసిన ప్రముఖ లక్షణములు బహుశ అతనికి ఉండి యుండక పోవచ్చును. సువార్తలలో అంద్రెయకు వెనుకస్థానము ఇయ్యబడినట్లున్నది. యేసుకు సన్నిహితంగా యున్న శిష్యుల గుంపుకు ఇతడు వెలుపల యున్నాడు.

కాని అంద్రెయ తనకుతానే చాల ప్రాముఖ్యమైనవాడు. మొద టిగా, శిష్యు లందరికంటె ముందు అతని పేరు చెప్పబడెను (యోహాను 1:40). అతడును ఇంకొక శిష్యుడును (బహుశ అతడు ఫిలిప్పు కావచ్చు) బాప్తిస్మ మిచ్చు యోహాను శిష్యులుగా యుండిరి. యేసును దేవుని గొఱ్ఱెపిల్లయని యోహాను పిలుచుట వారు వినిరి. వారు యేసును వెంబడించి ఆదినము ఆయనయొద్ద బసచేసిరి. అప్పుడు అంద్రెయ తన సహోదరుడైన సీమోనును చూచి తాను మెస్సీయను కనుగొంటినని చెప్పెను (అట్టి మాటను చెప్పిన శిష్యులలో మొదటివాడు అంద్రెయే). అతడు పేతురును యేసునొద్దకు తోడుకొని వచ్చెను.

పేతురును క్రీస్తు నొద్దకు తెచ్చుట కారంభించినది మొదలుకొని అంద్రెయ క్రీస్తుకొరకు వ్యక్తిగత పనివానిగా *(Personal worker)* తన కృషి నారంభించినట్లుగు పడుచున్నది.

తరువాత తన మధ్యాహ్న భోజనమును మూట కట్టుకొని తెచ్చుకొన్న ఒక బాలుని అతడు క్రీస్తు నొద్దకు తోడుకొని వచ్చెను. తనను వెంబడించుచున్న జనసమూహము ఆకలి గొన్నట్లు యేసు గమనించి వారి కాహారము పెట్టిన సందర్భమిది (యోహాను 6:1-13). వీరు భుజించుట కాహారము సంగతి యేమని యేసు ఫిలిప్పు నడుగగా 200 దేనారముల రొట్టె లయినను చాలవని అతడు జవాబిచ్చెను (బహుశ వారియొద్ద ఉన్న డబ్బు అంతా అదే కావచ్చును).

అప్పుడు అంద్రెయ ఒక చిన్నవాని యొద్ద అయిదు యవల రొట్టెలు రెండు చిన్న చేపలు ఉన్నవని యేసుతో చెప్పెను. యేసు ఆ బాలుని ఆహారము తీసికొని అయిదువేలమంది పురుషులున్న ఆ జన సమూహమున కాహారము పెట్టెను. వారు సంతృప్తిగా భుజించిరి. యేసుకును పేతురుకును మధ్య అంద్రెయ ఒక వంతెనవలె ఎట్లు పని చేసెనో ఈ బాలునికి యేసుకు మధ్య అతడు అట్లే పనిచేసెను.

యేసు చంపబడుటకు నాలుగు రోజుల ముందు కొందరు గ్రీసు దేశస్థులు (వారు యూదా మతప్రవిష్టులు కావచ్చును గాని) వారు యేసును చూడగోరిరి. వారు ఫిలిప్పు నొద్దకు వచ్చి అయ్యా మేము యేసును చూడగోరుచున్నామని చెప్పిరి. ఏమి చేయాలో ఫిలిప్పుకు తెలియక ఆ సమస్యను అతడు అంద్రెయకు చెప్పెను. అప్పుడు అంద్రె యయు ఫిలిప్పును యేసుతో చెప్పిరి. అందుకు యేసు మనుష్య కుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చియున్నదని చెప్పెను. బహుశ ఈ గ్రీసుదేశస్థులరాక ఆయన పొందబోయే మహిమను సూచించి యుండవచ్చును. మరల వారిని ఆయన యొద్దకు తోడుకొని వచ్చిన 'వంతెన' అంద్రెయే (యోహాను 12:20-24). క్రైస్తవ్యము చివరకు అన్య జనాంగముల గొప్పమత మాయెను, మరియు గ్రీసు దేశస్థులు అంగీకరించినంత ఉత్సాహముతో యూదులు సువార్తను ఎన్నడు అంగీకరించనందున యిది అతి ప్రాముఖ్యమైనది.

అంద్రెయ సామాన్య మానవుడనే మనము చెప్పుకొనవచ్చును. నిజానికి అతని పేరు గ్రీకు భాషలో 'మానవుడు' అను అర్థ మిచ్చు పదము నుండి ఉద్భవించినది. అంద్రెయకు ప్రత్యేకమైన తలాంతులు ఏమీ ఉండక పోవచ్చునుగాని యిది మాత్రము అతని గూర్చి చెప్ప వచ్చును. తరుణము దొరికినప్పుడెల్ల అతడు చేయగలిగినదంతా ఎంత చక్కగా చేయవలెనో అంత చక్కగా చేసెను. తీర్పునాటికి ఒకడు తనతో తీసికొని పోవుటకిది ఒక మంచి రికార్డు.

అంద్రెయలోని ఈ ప్రత్యేక లక్షణము క్రైస్తవ వర్తమానము యొక్క వెనుక నున్న శక్తులలో ఒకటి. శిష్యుడైనవాడు తనలో యున్న దేవుని వరమును సద్వినియోగ పరచవలెను. అతడు తన విద్యనుగాని, జ్ఞానమునుగాని, సాంఘిక స్థానమునుగాని, సమాజ నాయ కత్వ స్థానమునుగాని లెక్కచేయక ప్రభువు కొరకు పనిచేయవలెను. దీనిని గుర్తించియే ఒకాయన యిట్లనెను: నేను ఒక్కడినే, అయినను

నేనొకడిని. సమస్తాన్ని నేను చేయలేనుగాని కొంత చేయగలను. అయితే సమస్తాన్ని చేయలేక పోయినందున నేను చేయగలిగిన కొంచె మయినను చేయకుండుటకు నిరాకరించను.

—బిల్ స్టేఫర్డ్

---

## "మేము మెస్సీయను కనుగొంటిమి!"

"యోహాను మాట విని ఆయనను వెంబడించిన యిద్దరిలో ఒకడు సీమోను పేతురు యొక్క సహోదరుడైన అంద్రెయ. ఇతడు మొదట తన సహోదరుడైన సీమోనును చూచి మేము మెస్సీయను కనుగొంటి మని అతనితో చెప్పి యేసు నొద్దకు అతనిని తోడుకొని వచ్చెను. మెస్సీయ అను మాటకు అభిషిక్తుడని అర్థము. యేసు అతనివైపు చూచి-నీవు యోహాను కుమారుడవైన సీమోనువు; నీవు కేఫా అన బడుదువని చెప్పెను" (యోహాను 1:40-42).

---

## రక్షింపబడుటకు సంఘ సభ్యుడు కావలెనా?

## *(Must one be a Member of the Church to be Saved?)*

—పెర్రి కోతమ్

(గత సంచిక తరువాయి)

### క్రైస్తవు లందరు సంఘములో యున్నారు

సంఘ సభ్యుడు కాకుండా యెవడును క్రైస్తవుడు కానేరడు; ఏలయనగా ఒకడు దేనివలన క్రైస్తవు డగునో దానివలననే అతడు రక్షింపబడి సంఘములో చేర్చబడును. క్రైస్తవు లందరు సంఘ సభ్యులు మరియు సంఘ సభ్యులు మాత్రమే క్రైస్తవులు. గనుక సంఘ సభ్యుడు కానివాడెవడు రక్షింపబడలేడు, క్రైస్తవుడు కానేరడు.

ప్రభువు సంఘమునకు వెలుపల ప్రజలు రక్షింప బడగలిగితే, వారు లోకములోనే రక్షింపబడగలరు (కొలస్స 1:13-14). సంఘము అను పదమునకు పిలువబడినవారని యర్థము. ఆత్మీయ రాజ్యములు రెండున్నవి: అవేవనగా - సాతాను రాజ్యము, క్రీస్తు రాజ్యము. రక్షించ బడినవారందరు క్రీస్తు రాజ్యమను సంఘములోనికి మార్చ బడి యున్నారు (మత్తయి 16 : 18, 19). మరల సంఘము దేవుని మందిరమై యున్నది (1 తిమో 3:15). ఒకడు సంఘమునకు వెలుపల రక్షింపబడ గల్గితే, అతడు క్రీస్తు శరీరమునకు వెలుపల రక్షింపబడ గలడు, దేవుని రాజ్యమునకు, దేవుని కుటుంబమునకు వెలుపల రక్షింప బడగలడు. ఒకడు సంఘమునకు వెలుపల రక్షింపబడ గల్గితే, సంఘములో దేవుడు వేటిని ఉంచెనో అవి లేకుండా రక్షింప బడగలడు. క్రీస్తునందు సమస్త ఆశీర్వాదములు ఉన్నవి. క్రీస్తులోనే ఒకడు వీటిని అనుభవించగలడు. క్రీస్తులో యుండుట అనగా సంఘమైన ఆయన శరీరములో యుండుటయే.

మరల బాధ్యతగల ప్రజలు ఆ దైవసంస్థకు వెలుపల రక్షింపబడ గల్గితే, విలువలేని సంస్థకొరకు క్రీస్తు చనిపోయె నన్నమాట! సంఘమును కొనుటకు క్రీస్తు రక్తము వినియోగించ బడినందున, సంఘ సభ్యులు కానివారు ఆరక్తపు ఆశీర్వాదములను పొందలేరు. అయితే సంఘములో యున్నవారినే క్రీస్తు రక్షించునని బైబిలు విపులముగా చెప్పుచున్నది (ఎఫెసీ 5 : 23; 1 : 22-23). గనుక దానిలో లేనివారు నశించిన స్థితిలో యున్నారు.

యేసు రక్షించునని లేఖనములు బోధించుచున్నవి; మానవులను ఆయన శరీరమైన సంఘమునకు వెలుపలగాక దానిలో రక్షించునని అవి ధృవపరుచుచున్నవి. క్రీస్తులో యుండుట ఆయన సంఘములో యుండుట అనునవి దేవునితోగల సంబంధమును వర్ణించుట కుపయోగింప బడిన సరి సమాన పదములు. దేనిద్వారా క్రీస్తు పాపిని

రక్షించునో దానిద్వారానే అతడు క్రైస్తవుడగును, ప్రభువు సంఘ సభ్యుడగును.

ప్రభువు సంఘము యొక్క బైబిలు నిర్వచనమును ప్రజలు అర్థము చేసికొన్నప్పుడు, దానిలో సభ్యునిగా యుండు అవసరతను వారు గమనించగలరు. క్రీస్తు సంఘము అనగా రక్షింప బడినవారు, రక్షింప బడినవారందరు, రక్షింపబడినవారే తప్ప వేరొకరు కారు.

విమోచింప బడిన వారందరు క్రీస్తు సంఘమై యున్నారు. క్రీస్తు వారికి శిరస్సు. అది భూమిపై యున్న పరలోక రాజ్యము లేక దేవుని రాజ్యము. సంఘము శరీరమై యున్నందున, శరీరము సంఘమై యున్నందున క్రీస్తు శరీరమే క్రీస్తు సంఘము. మరియు స్థానిక సంఘము లన్నియు (**Local Congregations**) క్రీస్తు సంఘములై యున్నవి (ఎఫెసీ 1:22-23; 1 కొరింథీ 12:27; రోమా 16:16). క్రీస్తు సంఘము, క్రీస్తు సంఘములు అను పదములు ఒకే భావమును వ్యక్తపరచుచున్నవి. అది సంఘమును క్రీస్తు నిర్మించెననునది. అదొక డినామినేషన్ కాదు.

క్రీస్తు రాజ్యములో, సంఘములో మాత్రమే రక్షణ లభించును. అయినను క్రొత్త నిబంధన సంఘమును గూర్చి అపార్థము చేసికొనుట వలన ఒకడు సంఘము వెలుపలగాని లోపలగాని రక్షించబడునని అనేకులు భావింతురు. అందువలననే రక్షింపబడుట యనగా ఒకటి, సంఘ సభ్యుడగుట అనగా వేరొకటి యని ప్రజలు భావింతురు. సంఘము లన్నియు (డినామినేషన్లన్నియు) ఒకటే యనియు, అందొక దానిలో సభ్యుడు కావలెనన్న ఒకడు తనకుగా తాను చేరవలెననియు సంఘమును గూర్చిన ప్రతీతి. మతశాఖల తత్వమును బట్టి ఆలోచించుట వలన ఇట్టి భావము లుద్భవించును.

క్రీస్తు నిర్మించిన (క్రొత్త నిబంధన) సంఘము, ఒక డినామినేషన్‌గా ఎన్నడు చెప్పబడలేదు. దానిలో ఎవడును తనకు తాను చేరినట్టి రికార్డు ఎక్కడ లేదు. మానవ సంస్థలలో ఒకడు ఏదో రీతిగా

సంఘములో చేరలేదు. గాని ఒకడు సువార్తకు విధేయుడగుటద్వారా ప్రభువుచే సంఘముతో చేర్చబడును (అపొ. కా. 2:47).

"అన్ని సంఘములలోను మంచివారు లేరా?" యని తరుచు ప్రజలు అడుగుచుందురు. నైతికముగా చూచిన అవును, తప్పక యున్నారు. అయితే నైతికబుద్ధి రక్షణతో సమానమని ఇది నిరూపించుచున్నదా? డినామినేషన్లన్నియును మంచివే యనియును, సంఘము లన్నియు సరియైనవే యనియు దీనిభావమా? ఇది నిజమైన యెడల, ఏ సంఘమునకు చెందని మంచివారు కొందరున్నారు గనుక సంఘము సరికాదని యిది నిరూపించుచున్నది.

అయితే క్రొత్త నిబంధన సంఘమునకు వెలుపల యెవడును రక్షింప బడనేరడని బైబిలు బోధించుచున్నది. సంఘము లన్నియు మంచివేయని కూడ బైబిలు బోధించుటలేదు. అంతేకాదు ఒక డినామినేషన్ యొక్క సభ్యత్వము క్రీస్తు శరీర సభ్యత్వమునకు సమానము కాదు. అయితే పైన చెప్పబడిన వాదములలో యున్న దోష మేమిటి? నైతికముగా మంచితనము ఒక్కటే ఒకని క్రైస్తవునిగా చేయునను అసత్య సిద్ధాంతముపై అవి ఆధారపడి యున్నవి. ఒకడు దేవుని కుటుంబమునకు వెలుపల యుండి దేవుని బిడ్డ ఎట్లు కాలేడో అట్లే ఒకడు క్రీస్తు శరీరమునకు వెలుపల యుండి రక్షింపబడి క్రైస్తవుడు కాలేడని లేఖనములు బోధించుచున్నవి. ఒకడు ఆత్మీయముగా తిరిగి జన్మించినప్పుడు దేవుని కుటుంబమయిన సంఘములో అతడు ప్రవేశించును (యోహాను 3:3-5).

## ఏ డినామినేషన్‌లోను లేకుండా ఒకడు క్రైస్తవుడు కాగలడు

అన్ని డినామినేషన్లలోను క్రైస్తవులు లేరా? యని కొందరు అడుగుదురు. ఒకటి మాత్రము సత్యము: క్రైస్తవ్యము యొక్క

మొదటి శతాబ్దములో డినామినేషన్లలో క్రైస్తవులు ఎవరు లేరు, ఏల యనగా అప్పుడు డినామినేషన్లు ఏమియు లేవు. అప్పుడు క్రైస్తవు లుండిరి, వేలకొలది యుండిరి కాని వారందరు ఆ ఒకే శరీరములో, ప్రభువు సంఘములో యుండిరి (అపొ.కా. 4:32; 1 కొరింథీ 12:12-27). వారు డినామినేషన్ సంబంధులు కాక, క్రైస్తవులు మాత్రమే. క్రొత్త నిబంధనలో చెప్పబడిన క్రైస్తవు డెవడు ఆధునిక డినామినేషన్ యొక్క సభ్యుడు కాదు. క్రీస్తును వెంబడించుచున్నామని చెప్పుకొను వారిలో కూడ అది ఇప్పుడు అట్లే యుండవలెను. బైబిలు సూచించు మార్గమునకు అందరు లోబడినప్పుడది అట్లుండును.

డినామినేషన్ అనగా ఒక ప్రత్యేక పేరు, విశ్వాస ప్రమాణము లేక కేంద్ర కార్యాలయమును బట్టి విడిపోయిన ఒక శాఖ, గుంపు, తరగతి యని అర్థము. ప్రొటెస్టాంటు డినామినేషన్లు పదహారవ శతాబ్దములో, అనగా క్రీస్తు తన సంఘమును స్థాపించిన 1500 సంవత్సరముల తరువాత ఆరంభమాయెను. క్రొత్త నిబంధనలో ఏ ఒక్క డినామినేషన్‌ను గూర్చి చెప్పబడలేదు.

ప్రభువు సంఘము ఒక డినామినేషన్ కాదు; అది అన్ని డినామినేషన్ల కలయిక కూడ కాదు. అది దేని యొక్క శాఖగాని భాగముగాని కాదు. మతశాఖల తత్వము క్రొత్త నిబంధనకు విరుద్ధమైనది. ఒకడు డినామినేషన్‌లో సభ్యుడై యున్నందుకు దేవుడతనిని రక్షించునని తెలియజేసే లేఖనము ఏదియును లేదు.

రక్షింపబడవలెనంటే ఒకడు ఏదో ఒక డినామినేషన్ యొక్క సభ్యుడై యుండనవసరము లేదని మతశాఖలవారే చెప్పుచుందురు. అది నిజమే. అయితే రక్షింపబడవలెనంటే ఒకడు క్రీస్తు శరీరమైన సంఘములో సభ్యుడై యుండవలెనని బైబిలు బోధించుచున్నది. ఆత్మ ప్రేరితులైనవారు ఎవరినీ డినామినేషన్‌లో చేరవలెనని చెప్పలేదు కాని ఒకడు రక్షింపబడవలెనంటే క్రీస్తులో యుండవలెనను దానియొక్క

ప్రాముఖ్యతను వక్కాణించిరి. క్రీస్తులో యుండుట యనగా ఆయన సంఘములో యుండుటయే యని వారు వివరించిరి. గనుక క్రీస్తు స్థాపించిన సంఘమునకు వెలుపల యెవడును రక్షింపబడలేదు.

నిజముగా, ఒకడు ఏ డినామినేషన్‌లోను సభ్యుడు కాకుండా రక్షింపబడి క్రైస్తవుడు కాగలడు. ఒక డినామినేషన్‌లో చేరే అవుసరము ఏమియు లేదు. ప్రజలను రక్షించుటలో డినామినేషన్ చేయగలిగేది ఏదియు లేదు; ఏలయనగా వాటిలో దేనికి చెందకుండగానే ఒక వ్యక్తి రక్షింప బడగలడని ప్రజలు ధారాళముగా ఒప్పుకొందురు. కొందరు వ్యక్తులు ఒక డినామినేషన్‌గా తయారైన యెడల, లేక దానికి చెందిన యెడల, అపొస్తలుల కాలములో క్రైస్తవులు ఏమి చేయలేదో దానిని చేతురు. ప్రజలు క్రొత్త నిబంధన ననుసరించిన యెడల, వారు క్రైస్తవులుగా మాత్రమే యుందురు, క్రీస్తు శరీరమైన సంఘమునకు మాత్రమే చెందుదురు.

(సశేషము)

## పరిశుద్ధాత్మని పని

## *(The Work of the Holy Spirit)*

"ఆదరణ కర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26).

**A.** పరిశుద్ధాత్ముడు ఒక వ్యక్తి (యోహాను 16:13, 14).

1. ఆయన సమస్తమును బోధించును (యోహాను 14:26).
2. ఆయన సాక్ష్య మిచ్చును (యోహాను 15:26).
3. ఆయన సర్వసత్యములోనికి నడిపించును (యోహాను 16:13).
4. ఆయన మనకొరకు విజ్ఞాపన చేయును (రోమా 8:26).

5. ఆత్మ జీవము నిచ్చును (గలతీ 6:8).
6. పరిశుద్ధాత్ముడు ఒప్పింప జేయును (యోహాను 16:8).
7. పరిశుద్ధాత్ముడు మాటలాడును (యోహాను 16 : 13; 1 తిమో 4:1).
8. ఆత్మ సత్యము (1 యోహాను 5:6).

B. పరిశుద్ధాత్ముడు — వాక్యము :

1. లేఖనములు దైవజనుని పరిపూర్ణునిగా చేయును (2 తిమోతి 3:16, 17).
2. విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును (యోహాను 6 : 45).
3. మీరు నమ్మునట్లు యివి వ్రాయబడెను (యోహాను 2.:31).
4. వాక్యము వెలుగు నిచ్చును (కీర్తన 19:8).
5. వాక్యము జ్ఞానము పుట్టించును (కీర్తన 19:7).
6. వాక్యము పరిపూర్ణమైనది, ఆత్మను మార్చును (కీర్తన 19:7).
7. వాక్యము రక్షించును (యోహాను 17:17; అపొ. కా. 11:14; 1 పేతురు 1:22).
8. దేవుని వాక్యమయిన బీజమువలన ఆత్మ జనింపజేయబడును (1 పేతురు 1:23).
9. వాక్యము విశ్వాసము కలిగించును (రోమా 10:17).
10. పరిశుద్ధాత్ముడు అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించి నప్పుడు తన పనిని పరిపూర్ణముగా సంపూర్తి గావించెను (యోహాను 16:13-16).

C. పరిశుద్ధాత్ముడు — మార్పు చేయబడుట :

1. రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16).
2. యెహోవా ధర్మశాస్త్రము యథార్థమైనది, అది ప్రాణమును తెప్పరిల్ల జేయును (కీర్తన 19:7).

3. తండ్రివలన విని నేర్చుకొనినవాడు క్రీస్తు నొద్దకు వచ్చును (యోహాను 6:44-45).
4. "క్రీస్తు యేసునందు సువార్తద్వారా నేను మిమ్మును కంటిని" (1 కొరింథీ 4:15).
5. "ఆయన...సత్యవాక్యమువలన మనలను తన సంకల్పప్రకారము కనెను" (యాకోబు 1:18).
6. "మీరు ... శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూల ముగా ... పుట్టింపబడినవారు" (1 పేతురు 1:23).
7. దేవుని వాక్యము వినుటవలన విశ్వాసము కలుగును (రోమా 10 : 17).
8. దేవుని వాక్యము ఆత్మ ఖడ్గము (ఎఫెసీ 6:17).
9. మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32).
10. పాపి హృదయముపై పరిశుద్ధాత్ముడు సత్యవాక్యముద్వారా పనిచేయును. సువార్తయే సత్యవాక్యము (1 పేతురు 1:25).
11. పరిశుద్ధాత్ముడు వాక్యము నుండి వేరై వేరుగా పనిచేయునను సిద్ధాంతము సరైనదైనట్టయితే అప్పుడు అందరు రక్షింపబడాలి లేదా దేవుడు పక్షపాతి యగును. ఆ సిద్ధాంతము తప్పు.

D. పరిశుద్ధాత్ముడు — పవిత్రత :
1. పరిశుద్ధాత్ముడు క్రైస్తవులలో నివసించును (1 కొరింథీ 3:16; రోమా 8:9).
2. ఆయన మన హృదయములలోనికి పంపబడెను.
3. ఆయన మన ఆత్మతో సాక్ష్య మిచ్చును (రోమా 8:16).
4. ఆయన మనలో జీవించుటకు వాగ్దానము చేసెను (రోమా 8:11).

E. పరిశుద్ధాత్ముడు మనలో ఎట్లు నివసించును ?
1. దేవుడు మనలో నివసించును (2 కొరింథీ 6:16; కొలస్స 3:16).

2. క్రీస్తు మనలో నివసించును (ఎఫెసీ 3:17; కొలస్స 3:16).
3. వీరిద్దరు వాక్యముద్వారా మనలో నివసింతురు(2 యోహాను :9; గలతీ 3:2).
4. వీరెవరు వ్యక్తిగతముగా మనలో నివసింపరు. దేవుడు పరలోకమందును, క్రీస్తు ఆయన కుడిపార్శ్వమునను ఉన్నారు (అపొ.కా. 2 : 33).
5. పరిశుద్ధాత్ముడు వాక్యముద్వారా దేవుని యొక్కయు క్రీస్తు యొక్కయు ప్రతినిధిగా భూమిపై పనిచేయును (మత్త 10:40; లూకా 10:16; 1 థెస్స 2:13).
6. పరిశుద్ధాత్ముడు క్రైస్తవులలో నివసించునప్పుడు దేవుడు, క్రీస్తు కూడ వారిలో నివసింతురు (1 కొరింథీ 3:16, 17; యాకోబు 4 : 5).
7. లిఖింపబడిన వాక్యముద్వారా ఆత్మ మాట్లాడును (ప్రకటన 2 : 1, 29).
8. తండ్రి కుమార పరిశుద్ధాత్మలు దేవుని ప్రజలలో నివసింతురు (ఎఫెసీ 2:20-22).
9 దేవుడు, క్రీస్తు పరిశుద్ధాత్మలు వాక్యముద్వారా మనలో నివసింతురు (యోహాను 16:13-15; 2 పేతురు 1:3; 2 తిమో 3 : 16).
10. తండ్రి కుమారులు నివసించు రీతిగా అనగా వాక్యముద్వారా పరిశుద్ధాత్ముడు క్రైస్తవులలో నివసించును (రోమా 8:11; గలతీ 2:20; ఎఫెసీ 3:17; కొలస్స 1:27; 2 కొరింథీ 6:16).

F. మనలో నివసించు పరిశుద్ధాత్మ :

దేవుని వాక్యము ఆత్మయొక్క ఖడ్గము. వాక్యమునుండి వేరై ఆత్మ పనిచేయునను సిద్ధాంతము తప్పు (ఎఫెసీ 6 : 17). వాక్యముద్వారా తప్ప ఆత్మ వేరే విధముగా ఒప్పింప జేయదు, నడిపించదు,

బయలుపరచదు, మనలో నివసించదు, పనిచేయదు (ఎఫెసీ 5:18, 19; కొలస్స 3:16). మనలో నివసించు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు ఒకే స్థానములో నివసింతురు (ఎఫెసీ 2:20–22; 2 యోహాను :9). క్రీస్తు వాక్యము సమృద్ధిగా నివసించు హృదయములో వారు నివసింతురు.

సువార్తకు తక్షణమే లోబడుము!!

—W. A. బాక్స్‌ఫీల్డ్

---

## మానవుడు

దైవ సృష్టి అంతటిలో మనిషి ఉత్కృష్ట జీవి. సృష్టికి అతడే అధినేత; జ్ఞానాత్మపూర్ణుడు; స్వయం నిర్ణయాధికారం గలవాడు. చరాచర జగత్తు అతని స్వాధీనంలో వుంచబడింది.

డార్విను దృష్టిలో మనిషి పశుప్రాయుడు; జంతు సమానుడు. తాత్వికుని భావనలో అతడొక మాయ. వేద మతస్థుని రచనలలో అతడు పంచభూతాల కలయిక. ఉపనిషత్సారంలో అతడు మర్మం. బుద్ధుని వాదంలో అతడు శూన్యం. నాస్తికుని ఆలోచనలో అతడు మాంసపుముద్ద; ఎముకల గూడు.

మానవుని గూర్చి తెలిసిందల్లా యిదే అయితే మానవుడు తనను గూర్చి తానేమీ ఎరుగనట్టే! విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందింది. మానవుడు గ్రహాంతరయానం చేస్తూ క్రొంగొత్త సంగతులు తెల్సుకుంటున్నాడు. సముద్ర గర్భంలో సంచరిస్తూ ఆశ్చర్య విషయాలు గ్రహించుచున్నాడు. కాని తనను గూర్చి తాను ఎరుగడు.

### మానవు డెవరు ?

మానవు డెవరు ? దేవుడెందుకు మానవుని నిర్మించెను ? ఎట్లు నిర్మించెను ? "నేను" అంటే ఎవరు ? మరణం తరువాత మానవుని

గతేమిటి? అసలు దేవుడు మానవుని నిర్మించటంలో ఉద్దేశ మేమైనా కలదా?

పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు మానవుని గూర్చిన సంపూర్ణ సత్యం నేర్పించలేవు. మానవుని మేధస్సుకు, జ్ఞానానికి అది అందదు. విద్యావేత్తలు నేర్పేది, మనం నేర్చుకునేది మానవుని భౌతిక దేహానికి సంబంధించిన సంగతులు మాత్రమే. చర్మం, కీళ్లు, రక్తనాళములు, మెదడు, గుండె, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, కన్ను మొదలగు భాగములు, అవి పనిచేయు విధానమేగదా మనం నేర్చుకొనేది?

మానవుని సంపూర్ణస్థితిని దైవగ్రంథం ఒక్కటే తెలియజేయ గలదు. దేవుని గ్రంథంలో దేవుని గూర్చిన సత్యము, మానవుని గూర్చిన సత్యము మనకు సంపూర్ణముగా బయలుపర్చబడెను. దేవుడు సృష్టికర్త; ప్రేమాస్వరూపి; కరుణామయుడు; న్యాయవంతుడు; పరిశుద్ధుడు; నిత్యుడు; సర్వశక్తిమంతుడు; సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి.

## మానవునిపట్ల దేవుని సంకల్పము

మానవుణ్ణి ఆయన అకారణంగా నిర్మించలేదు. మానవునిపట్ల ఆయనకు సంకల్పము గలదు. ఆయన మనలను సృజించుటలో ఉద్దేశమేమి? యేసు క్రీస్తుద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన మనలను క్రీస్తులో యేర్పరచుకొనెను (ఎఫెసి 1:4-6). దేవుని కుమారులు క్రీస్తు సారూప్యములోనికి మార్చబడవలెను (రోమా 8:29-30).

మానవుడు దేవుని పోలిక (ఆది.కా. 1:26). నేలమంటితో నరుని నిర్మించి, వాని నాసికారంధ్రములలో జీవవాయువు నూదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.కా. 2:7). శరీరం, ఆత్మ అను ఈ రెండు భాగాల సమ్మేళనం మానవుడు. బాహ్య పురుషుడు, ఆంతర్య పురుషుడు అని వ్యవహరించనగును (2 కొరింథి 4:16). ఆత్మకు చావు లేదు.

ఆత్మ శాశ్వతం; దేవుని పోలిక; అసలు నీవు, నేను. శరీరం మృతం; అశాశ్వతం, భౌతికం; అసలువ్యక్తి ఆత్మకి గుడారం.

మానవుని భౌతిక జీవితం యాత్రవంటిది; మానవుడు యాత్రికుడు (ఆది. కా. 47:8-9, హెబ్రీ 11:13; I పేతు 2:11). నరుని ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు; అధికబలముంటే ఎనుబది (కీర్త 90:10). నరుని ఆయువు పువ్వువంటిది; నీడవంటిది (యోబు 14:1-2). అతని దేహం నేలమన్ను (ప్రసంగి 12:7). నరుని భౌతిక జీవం ఆవిరి వంటిది (యాకోబు 4:13, 14).

## మన స్వాస్థ్యము

దేవుని కుమారుడు దేవుని వారసుడు (గలతీ 5:29). క్రీస్తు తోడి వారసుడు (రోమా 8:17). మనము క్రీస్తు మహిమలో పాలి వారము (హెబ్రీ 2:10). మన స్వాస్థ్యము అక్షయమైనది; నిర్మలమైనది; వాడబారనిది (I పేతు 1:3-4). నిత్య జీవము, నిత్య రాజ్యము, దేవుని మహిమ, దేవుని కుమారులు అనుభవించు స్వాస్థ్యము (మత్తయి 19:29, మత్తయి 25:34, రోమా 8:18-25).

నీటి మూలముగను, ఆత్మ మూలముగను జన్మించితివా? నీకు సమీపములోవున్న క్రీస్తు సంఘమును సందర్శించ మనవి. సత్యవాక్యమును తెలియజేయుటలో వారు మీకు తోడ్పడగలరు.

—Bro. సత్యానందం, రాజమండ్రి-3

---

## మానవుని కంటె ఘనుడు

## ( *More than a Man* )

నేను మనుష్యుల నెరుగుదును గాని యేసు మానవుడు కాదని నేననుచున్నాను. యేసు మతము (మార్గము) ఒక మర్మము. అది దాని సొంతశక్తి మీదనే ప్రబలుచు మానవుని నుండి గాక వేరొక ని మేధస్సు నుండి ఉద్భవించినది. మున్నెన్నడు ఎరుగని మాటలు

క్రియలు గలిగిన ఒకని వ్యక్తిత్వంలో దానిని మనం కనుగొందుము. యేసు ఒక వేదాంతికాడు. సూచకక్రియలే ఆయన ఋజువులు. మరియు మొదటి నుండి ఆయన శిష్యులాయనను కొనియాడిరి. అలెగ్జాండరు, సీజరు, చార్లిమేను, నేనుకూడ సామ్రాజ్యములను స్థాపించితిమి; గాని మా జ్ఞానాగ్ని బట్టి సృజించిన వీటిని మేము దేనిపై నిలబెట్టితిమి? సైన్యబలము పైననేగదా! యేసు అట్టి శక్తివలన గాక ప్రేమ వలన ఒక సామ్రాజ్యమును స్థాపించెను. అయితే నేటికి కూడ లక్షలాది ప్రజలు ఆయన కొరకు ప్రాణముల నర్పించగలరు!!

—నెపోలియన్ చక్రవర్తి

---

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA-533 001

**Printed Book only**

To

..............................................

..............................................

..............................................

..............................................